డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలి

సదాశివనగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు కోరారు. సంవత్సరం కిందట డబుల్‌రోడ్డు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు పూర్తిగా వేయడం జరిగినందున గృహాలు లేనివారికి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాల వద్దనే సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దృశ్యం

సన్నంగా నొక్కేస్తున్నారు!

- సన్న రకం ధాన్యం రైతులను దగా చేస్తున్న దళారులు
- మద్దతుధర కంటే తక్కువ ధరకే కొనుగోళ్లు
- క్వింటాల్‌కు రూ.500 నుంచి 800ల వరకు తక్కువకు కొనుగోళ్లు
- సన్నాలకు డిమాండ్ ఉన్నా నాణ్యత పేరుతో రైతుల దగా
- కేంద్రాల్లో సన్నాలు కొనుగోలు చేయని ప్రభుత్వం
- దిక్కుతోచక దళారులకు విక్రయిస్తున్న రైతులు
- నష్టపోతున్న అన్నదాతలు
- జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల్లో సన్న రకం దిగుబడులు

కామారెడ్డి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్న రకం వరి ధాన్యాన్ని పండించిన రైతులను దళారులు దగా చేస్తున్నారు. సన్న రకం ధాన్యానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ నాణ్యత లేదని తాళ్లు ఉన్నాయంటూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో వేల ఎకరాల్లోనే సన్న రకం వరి వంగడాలను రైతులు సాగు చేశారు. ఎన్నో కష్టాలను అధిగమించి పండించిన ధాన్యాన్ని దళారులు గద్దల్లా తన్నుకపోతున్నారు. ప్రభుత్వం దొడ్డు, సన్న రకానికి ఒకే మద్దతు ధరను ప్రకటించింది. కానీ ఈ సీజన్ నుంచి సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అధికారులు సన్నాలను వేరుగా కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఒక్క గింజ కూడా ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. ఇదే అదనుగా భావించిన దళారులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దళారులు పంట చేనుల్లోనే కళ్లాల వద్దనే సన్న రకం ధాన్యాన్ని రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సన్నాల సాగు

జిల్లా రైతులు దొడ్డు రకంతో పాటు సన్న రకం వరి ధాన్యాన్ని ఎక్కువగానే సాగు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 3 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 2 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగు కాగా లక్ష ఎకరాల్లో సన్న రకం వరి రైతులు సాగు చేశారు. సన్న రకం వరిని ఎక్కువగా బాన్సువాడ, నస్రూల్లాబాద్, బీర్కూర్, బిచ్కుంద, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట తదితర మండలాల్లో రైతులు సాగు చేశారు. అయితే సాగుకు తగ్గట్టుగా 2 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలో దొడ్డు రకానికి ఏ ధర ఉందో అదే ధర సన్నాలకు ఉంది. బహిరంగ మార్కెట్‌లో సన్నాలకు ఎక్కువగా ధర వస్తుందని ప్రభుత్వాలు చెప్పడంతో దిగుబడులు తక్కువ వచ్చినప్పటికీ సన్నాలనే సాగు చేశారు. తీరా బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా పలకడం లేదు.

బహిరంగ మార్కెట్‌లో మద్దతుధర కరువు

జిల్లాలో సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధర కరువవుతోంది. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో ఈ సంవత్సరం వానాకాలం సీజన్‌లో బీపీటీకి, ఆర్ఎన్ఆర్, బాపట్ల, గంగాకావేరిలతో పాటు నూతనంగా బీపీటీ-95 సన్నరకం వరిని సాగు చేశారు. గతంలో ఇవి సాగు చేసిన రైతులకు మంచి ధర రావడంతో లాభాలను ఆర్జించారు. ఈ సారి కూడా అదే ఆశతో సాగు చేశారు. జోరుగా కురుసిన వర్షాలతో పంటను ఇళ్లలో నిల్వ చేసుకోలేక, గిట్టుబాటు ధరకు కొనే నాథుడే లేక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఒకవేళ నిల్వ చేసుకుందామంటే పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత పేరుతో దండుకుంటున్న దళారులు

జిల్లాలో సన్నరకం ధాన్యం రైతులను దళారులు దండుకుంటున్నారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ కొనుగోలు జరగకపోవడంతో ఇదే అదునుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు దళారులతో కలిసి సన్నరకం వరి ధాన్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు సన్నాలను సాగు చేశారు. దిగుబడులు తక్కువగా వస్తాయని తెలిసినప్పటికీ దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయరేమోనని సన్నరకం వరి వైపే మొగ్గుచూపారు. తీరా పంట చేతికొచ్చింది. మరోవైపు ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో తెరుచుకోలేదు. చేతికొచ్చిన పంటను రోజుల తరబడి అలాగే ఉంచలేక తప్పని పరిస్థితుల్లో దళారులకు విక్రయిస్తున్నారు. అయితే సన్నరకం ధాన్యం నాణ్యత లేకపోవడం, తేమ శాతం లేదని తాళ్లు ఎక్కువగా ఉన్నాయంటూ పలు కారణాలతో దళారులు మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.500ల నుంచి రూ.800ల వరకు తక్కువగా కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మద్దతు ధర 2320 ఉండగా రూ.1900ల వరకే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇలా అదును చూసి దళారులు సన్నరకం రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. గిట్టుబాటు కాకపోయిన చేసేదేమిలేక అన్నదాతలు వారికే విక్రయిస్తున్నారు.

వ్యాపారులకు పరోక్ష సహకారం

జిల్లాలో మార్కెటింగ్ శాఖ అధికారులు వ్యాపారులకు పరోక్ష సహకారం అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వరి కోతలు ప్రారంభం కాగానే మార్కెట్ యార్డులలో బీట్‌లు నిర్వ హించాల్సి ఉండగా ఇప్పటి వరకు చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు, సన్న రకం ధాన్యానికే మద్దతు ధర లభిస్తోంది. సన్న రకం ధాన్యానికి గ్రేడ్ టు రకం కింద పరిగణిస్తు న్నారు. అయితే ఈ సీజన్ నుంచి ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరతో కలిపి రూ.500ల బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ ప్రక్రియసాగడం లేదు. బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి డిమాండ్ ఉండటంతో వ్యాపారులకు పరోక్షంగా తోడ్పాటు అందిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ యార్డులలో బీట్ నిర్వహిస్తే వ్యాపారుల మధ్య పోటీ పెరిగి అన్న దాతలు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్, మిర్యాలగూడ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల దళారుల ద్వారా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. జిల్లాలో బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, బిచ్కుంద మండలాల్లో దళారులు ప్రత్యేకంగా దుకాణాలు తెరిచి బహిరంగంగానే వ్యాపారం నిర్వహిస్తున్నా చర్యలు తీసుకున్న వారే లేకపోయారు.





లింగంపేటలో నాగన్న బావి అందాలను తిలకిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

నాగన్న బావి ఆనాటి నాగరికథకు సాక్ష్యం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

లింగంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న బావి ఆనాటి నాగరికథకు సాక్షం అని చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్ అన్నారు. ఆయన ఆదివారం లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న బావి (మెట్లబావి)ని సందర్శించారు. మెట్ల బావి అద్భుత కట్టడమని ఆయన తెలియజేశారు. బావిని పునరుద్ధరించడంతో భావితరాలకు ఆనాటి నాగరికథ గొప్పతనం తెలుస్తుందని ఆయన తెలియజేశారు. బావి అందాలను తిలకించి ఆశ్చర్య పోయారు. ఆయన వెంట సుదర్శన్, శంకర్, సురేందర్, బాబు, నర్సింగరావు, కమురుద్దీన్, అమృత్‌లతో పాటు మరి కొందరు ఉన్నారు.

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని ఆదివారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనవసతి, ఇతర మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అల్పాహారం వడ్డించడమే కాకుండా అల్పాహారం తిని చూశారు.

ప్రతీ ఇంటికి తిరిగి సభ్యత్వం చేయించాలి

కామారెడ్డి నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తిరిగి బీజేపీ సభ్యత్వం చేయించాలని ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెల ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండో దశ పూర్తి కావస్తుందన్నారు. ప్రతీ కార్యకర్త ప్రతీ ఇంటికి తిరిగి సభ్యత్వం చేయించాలని అన్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే

100 మంది ప్రాథమిక సభ్యత్వం చేస్తేనే క్రియాశీల సభ్యత్వానికి అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంటాల క్మారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భరత్, శ్రీధర్,రమేష్, రంజిత్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్య అంటే సంస్కారం నేర్పేది



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మంచి పుస్తకాలతో కూడిన గ్రంథాలయాలను ప్రతీ మండలంలో అందుబాటులోకి తేవాలి
- అందుకు నూతన చైర్మన్ కృషి చేయాలి
- ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి తోసిన ఘనత బీఆర్ఎస్‌దే..
- రైతులను, నిరుద్యోగులను తీవ్ర ఇబ్బంది పెట్టి ఇప్పుడు ప్రేమను ఒలకపోస్తుంది
- ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేశాం.. మిగిలిన వారికి త్వరలోనే చేస్తాం
- రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలవాలి
- అందుకు ప్రతీ కార్యకర్త తన చుట్టుపక్కల ఉన్న గ్రాడ్యుయేట్‌లను ఓటు నమోదుకు ప్రోత్సహించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విద్య అంటే అక్షర జ్ఞానం కాదు.. సంస్కారం నేర్పేదని, విద్య వల్ల అనేక మంచి లక్షణాలు వస్తాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి పదవి బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చంద్రకాంత్‌రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీతో కలిసి ఆయనను ఆశీర్వదించారు. అనంతరం సత్యగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్య అందుబాటులోకి రావాలంటే మంచి పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలన్నారు. అందుకోసం ప్రతీ గ్రామంలో గ్రంథాలయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి నూతన చైర్మన్ కృషి చేయాలని, నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇస్తానని తెలిపారు. ఇక త్వరలో గ్రాడ్యుయెట్ ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోతున్నాయని గడిచిన 10 ఏళ్ల కాలంలో గత ప్రభుత్వం చేసిన లూటీని గ్రాడ్యుయేట్‌లు గమనించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలను గెలిపించేందుకు సహకరించాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఇంట్లో వారితో పాటు చుట్టుపక్కల వారిని గ్రాడ్యుయెట్ ఓటు నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటు నాటికి ధనిక రాష్ట్రంగా ఉన్న రాష్ట్రాన్ని 8లక్షల కోట్ల అప్పుల పాలు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలుచేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతుందని, పట్టుమని పది నెలలు నిండని ప్రభుత్వంపై పొద్దున లేస్తే సోషల్ మీడియా వేదికగా అసత్యప్రచారాలు మొదలుపడుతుందని అన్నారు. 75 సంవత్సరాలు కాంగ్రెస్‌తో పాటు మిగిలిన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొత్తం కలిపి రూ.75 వేల కోట్ల అప్పులు చేస్తే కేవలం పదేళ్ల కాలంలోనే 8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల మీద గత ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. నెలకు 6 వేల కోట్లు వడ్డీ కటాల్సి వస్తుందని ఇచ్చిన సంస్థలు ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నాయనిన్నారు. పదేళ్లలో రైతులను, నిరుద్యోగులను తీవ్ర ఇబ్బంది పెట్టి ఇప్పుడు ప్రేమను ఒలకపోస్తుందని నిరుద్యోగులకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ వారి ముఖంలో ఆనందం చూసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, రైతులకు రుణమాఫీ చేశామని మరో 4 లక్షల మందికి దీపావళి తర్వాత రుణమాఫీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్షాళన మొదలుపెట్టిందని రైతుభరోసా పేరుతో రైతులకు పెట్టుబడిడబ్బులు అందిస్తామన్నారు. అందుకు కొంత సమయం తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కేటీఆర్‌లు హైడ్రా, మూసి ప్రక్షాళన, రైతుభరోసాపై చర్చకు సిద్ధమా అని అంటున్నారని పదేళ్లలో వారు సక్రమంగా పనులు చేసి ఉంటే ఇప్పుడు ఆ పనులు ఎందుకు మొదలుపెట్టాల్సి వస్తుందని అన్నారు. తాము సైతం చర్చకు సిద్ధమని లాల్‌బహదూర్ స్టేడియంలో వేదిక ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులపై చర్చ జరుపుదామని అన్నారు. ఇక బీజేపీ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పోరాటం చేసిన కేవలం ఉత్తరాది మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసినట్లుగా తెలంగాణను ఏర్పాటు చేయకుండా మీనమేషాలు లెక్కపెట్టిందని ప్రత్యేక తెలంగాణను ఇస్తే ఆంధ్రలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగుతుందని తెలిసిన సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ ఇచ్చిందని, పేద రైతులకు న్యాయం జరగాలని ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకుందని అన్నారు.

స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను త్వరలో విడుదల చేస్తాం

కళాశాలలకు త్వరలోనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్, పర్యాటక, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఇంటి వద్ద ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం, టీఎన్‌జీవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కళాశాలలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని టీఎన్‌జీవోల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. ప్రతతః గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఐరేని సందీప్, విద్యార్థి సంఘ నాయకులు విఠల్, అరుణ్, కళాశాల యజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన అందరికీ న్యాయం చేస్తాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

పదేళ్లు పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ కోసం పని చేసిన అందరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి పార్టీలో చురుకుగా పనిచేసిన ఐరేని సందీప్, చందుతో పాటు మరికొందరు నాయకులు ఆశించారని కానీ సీనియార్టీ ప్రకారం మద్ది చంద్రకాంత్‌రెడ్డికి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కేటాయించామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తను ఆదుకుంటామని అందుకోసం ఇందిరమ్మ కమిటీలు, ఇతర పదవులు ఉన్నాయని ఎవరు నిరాశ చెందవద్దని అన్నారు. భిక్కనూర్ ఏఎంసీ చైర్మన్‌గా పాత రాజుకు అవకాశం కల్పించామని గత ప్రభుత్వంలో ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన ఎలాంటి భయం దోళన చెందకుండా ఎక్కడ లొంగకుండా న్యాయపరంగా పోరాటం చేసి మరి పార్టీలోనే కొనసాగాడని అందుకే అతనికి ఏఎంసీ చైర్మన్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచే ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచాడని కలిసి అభివృద్ధి చెందామంటే అడ్డుకుంటున్నాడని అన్నారు. దోమకొండ 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చి త్వరలోనే ముఖ్యమంత్రితో ప్రారంభం చేస్తామని తెలిపారు. అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతీరైతుకు ఎకరాకు రూ.10వేల చొప్పున అందించామని అన్నారు. బీఆర్ఎస్ ఇప్పుడు రైతుబంధు అంటూ గగ్గోలు పెడుతుందని రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అనర్హులకు సైతం బీఆర్ఎస్ రైతుబంధు ఇచ్చిందని కాంగ్రెస్ నిజమైన రైతులకు అందలనే రైతుభరోసా పేరుతో అందించేందుకు ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మానాల మోహన్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, నాయకులు రవీందర్‌రెడ్డి, తాహెర్‌బీన్, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మారిన పిప్రి-ఖానాపూర్ రోడ్డు

● ఆర్మూర్ నుంచి గోదావరి తీరం వరకు రోడ్డు గుంతల మయం ● పిప్రి- ఖానాపూర్ గ్రామాల మధ్య గుంతలు పడ్డ రోడ్డు ● ప్రజలకు తప్పని తిప్పలు



పిప్రి, మగ్గిడి గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్మూర్ మండలం పిప్రి గ్రామం నుంచి మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా మారింది. గతంలోనే రోడ్డు గుంతలుగా మారి ప్రజలకు ఇబ్బందిగా మారగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటి 70లక్షలు మంజూరు చేసింది. పనులను ప్రారంభించి ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు ప్రయాణం అసౌకర్యంగా మారింది. సుమారు ఎనిమిది కిలోమీటర్ల వరకు రోడ్డు గుంతలు పడి ఉండడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డ కారణంగా పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడి పోయి ప్రమాదాలకు గురై ఆసుపత్రిలో చేరిన సంఘ టనలు ఎన్నో ఉన్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలుగు తున్నా యని తెలిసినప్పటికీ సం బంధిత అధికారులు పనులు చేపట్టి పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోప ణలు వస్తున్నాయి.

నిత్యం రద్దీగా ఉండే రోడ్డు

ఈ రోడ్డు వచ్చిపోయే వాహనాలు, ప్రయాణం చేసే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్న విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్న ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. అంతే గాకుండా గోదావరి పరివాహక ప్రాంతం వద్దకు పుణ్య స్నానాలకు, ఇతర శుభకార్యాలయాలకు వెళ్లే భక్తులకు సైతం రోడ్డు రద్దీగా ఉంటుంది. గుంతలు పడిన రోడ్డుతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. ఈ మూడు గ్రామాల నుంచి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. విద్యార్థులను పాఠశాలలకు చేరవేసే ఆటోలు, బస్సులను ఈ రోడ్డుపై నడపడానికి డ్రైవర్‌లు శ్రమపడాల్సి వస్తోంది. ఈ రోడ్డుకు పదేళ్ళ క్రితం బీటీరోడ్డు వేశారు. అనంతరం రోడ్డుపై గుంతలు పడినప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు పిప్రి నుంచి ఖానాపూర్ వరకు రూ.కోటి 70లక్షలు మంజూరు చేసింది. ఇళ్ల మంజూరైనప్పటికీ ఇప్పటికీ పనులు చేపట్టకపోవడం బాధాకరం. తాము పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించి మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అమ్దాపూర్ శివారులో గుంతలు పడ్డ రోడ్డు ఇదే..

గుంతల రోడ్డుతో ప్రయాణం ఇబ్బందిగా ఉంది



గుంతలు పడ్డ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఉండడంతో అవస్థలు తప్పడంలేదు. రోడ్డు మరమ్మతులకు నిధులు మం జూరై ఏడాది గడిచిపోయినప్పటికీ పనులు చేపట్ట లేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి.

- చిన్నారెడ్డి, మగ్గిడి

టీచర్ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం


నందిపేటలో డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

నందిపేట, అక్టోబరు 20: మండల కేంద్రంలోని నందికేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన నలుగురికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు.సీఎంరేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఉత్తీర్ణత సాధించిన మౌనిక రేఖ, సతీష్, భూషణ్‌లను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహి పాల్, నాయకులు జ్యోతి నారాయణ, వైఎస్ గంగాధర్, బెంజర్ గంగా ధర్, ఇసూబ్, ఎడ్డిగారి నిఖిల్, పీరాజీ నాగరాజు, ప్రభుదాస్ ఉన్నారు.

అన్ని హంగులతో ఏటీసీ కేంద్రాలు

● సత్వర ఉద్యోగ ఉపాధి అందించేలా అడ్వాన్స్‌డ్ కోర్సులలో శిక్షణ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు అధునాతన హంగులతో అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల శాశ్వత భవన నిర్మాణాలు, శిక్షణ తరగతుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని ఆయన అన్నారు. ఏటిసిలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సత్వరమే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత కనబరుస్తున్నామని అన్నారు. టాటా టెక్నాలజీస్ కంపెనీ సహకారం సమన్వయంతో యువతలో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం ఎన్‌సీవీటి ఆమోదించిన పరిశ్రమ 4.0 ట్రేడ్‌లలో నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలలో (ఐటిఐ) అధునాతన సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఏటిసిలలో అధునాతన కోర్సులను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని డోమెస్టిక్, మల్టీ-నేషనల్ కంపెనీల ద్వారా రిక్రూట్ చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో అప్రెంటీస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని టాటా మోటార్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కిర్లోస్కర్, మహేంద్రా అండ్ మహేంద్రా, హెచ్‌ఏఎల్, లాక్‌హీడ్, మార్టిన్, యూఎస్ ఆధారిత కంపెనీ మొదలైన వందకంటే ఎక్కువ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు లభించవచ్చని తెలిపారు. మానిఫ్యాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్, మెకానిక్, ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సు,ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్,అడ్వాన్స్‌డ్ సీఎన్‌సి మిషనింగ్ టెక్నీషియన్ తదితర కోర్సులు ఉన్నాయని 10వతరగతి ఉత్తీర్ణులైన వారుపై కోర్సులలో నేరుగా చేరవచ్చని కలెక్టర్ సూచించారు. ఏడాది నుంచి రెండు సంవత్సరాల వరకు కోర్సుల కాలవ్యవధి ఉందని తొలివిడతగా నిజామాబాద్‌లోని ప్రభుత్వ ˉలుర ఐటిఐ,బోధన్, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటిఐలలో ఏటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈనెలాఖరులోగా ఆసక్తిగల విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరై ప్రవేశాలు పొందాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా


ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

గాంధారి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి పరుస్తానని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న పనులను కూడా కాంట్రాక్టర్లతో చేయిస్తున్నానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో గాండ్ల శ్రీను మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ పరమేష్,డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయి కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మన్, రాజు,బాలరాజు, బాలయ్య, లైన్‌రమేష్, తదితరులు పాల్గొన్నారు.


రేపు బాన్సువాడ బంద్‌కు పిలుపు

బాన్సువాడటౌన్,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):హిందువుల ఆత్మా భిమానమైన దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా హిందూ సంస్కృతిని నాశనం చేయాలనే దుర్మార్గపు చర్యను నిరసిస్తూ మంగళవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో బాన్సువాడ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు ప్రతీ హిందూ సహకరించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గాంధారి,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):గాంధారి గ్రామశివారులోని ఎస్ ఆర్ దాబా సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. నాగ్లుర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రావు(42)ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు నుంచి బాన్సువాడకు వెళ్తున్న వడ్లలారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై భాస్కర్‌రావు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు.మృతుని భార్యలీలావతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐతెలిపారు.

తాత్కాలిక షెడ్డు నిర్మాణ పనులను త్వరగా చేయాలి


నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న పోచారం, ఆగ్రోస్ చైర్మన్ కాసుల

బాన్సువాడ,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో రోగులకొర కునూతనంగా నిర్మిస్తున్న తాత్కా లిక షెడ్డు నిర్మాణ పనులను వేగవంతం చే యాలని రోగులకు అందు బాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు సూచిం చారు. ఆదివారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రవణానందంగా స్వర సౌరభం

నిజామాబాద్ కల్చరల్,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీ రంగారావులు నటించిన అలనాటి చిత్రాల పాటలతో స్వర సౌరభం శ్రవణానందంగా సాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని గీతా భవన్‌లో కళాసంస్థ నిర్వహించిన పాత పాటల వెన్నెల స్వరసౌరభంలో గాయనీ గాయకులు పాత పాటలతో ప్రేక్షకులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నాగరాజు శర్మపాల్గొన్నారు.

ఐలాపూర్ సొసైటీ డైరెక్టర్ మృతి


మహమ్మద్ హుస్సేన్(ఫైల్)

నందిపేట, అక్టోబరు20: మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం డైరెక్టర్ మహమ్మద్ హుస్సేన్(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వెల్మల్ గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ నాలుగున్నర సంవత్సరాల నుంచి ఐలాపూర్ సొసైటీ డైరెక్టర్‌గా కొనసాగుతు న్నారు. ఆయన అంత్యక్రియలు వెల్మల్ లో జరిగాయి. సొసైటీ చైర్మన్ సిద్దాపురం మీ సాల సుదర్శన్, వైఎస్ చైర్మన్ బైన చిన్నారెడ్డి, సీఈవో దాసరి నరహరి, డైరెక్టర్లు అంత్యక్రిల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ అంత్యక్రియల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో వైభవంగా ఎల్లమ్మ బోనాలు


ధర్పల్లిలో బోనాల ఊరేగింపు దృశ్యం

ధర్పల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఎల్లమ్మ బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఐదో వార్షికోత్సవం సందర్భంగా గౌడసంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విన్యాసాలను ప్రజలను ఆకట్టుకున్నాయి. బుధవారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని కార్యవర్గ సభ్యులు సురేందర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, రమేష్‌గౌడ్, నర్సాగౌడ్, లాలాగౌడ్, లింబాగౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు జలం, జానకంపేట గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఆయా గ్రామాల గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు.ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని కుల సంఘాల సభ్యులు మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న గ్రామదేవతలకు బోనాలు సమర్పించి నైవేద్యాలు పెట్టారు. ఈ వేడుకల్లోఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: పాడి పంటలతో ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ కడలపోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాటిగల్లీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో సంఘ సభ్యులు, మహిళలు బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను నెత్తిన పెట్టుకొని పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి పోచమ్మకు బోనాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేణు, ఉపాధ్యక్షుడు భాస్కర్, రవీందర్, భూపతి, శ్రీధర్, రవీందర్, అనీల్‌కుమార్, సత్యప్రకాశ్, శ్రీనివాస్, రాజు, పెద్ద గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి నుంచి గంగాజలాలను తీసుకువచ్చి గ్రామదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎడ్లబండ్లతో ర్యాలీగా ప్రదర్శన చేశారు. ఈకార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, పాల్గొన్నారు.

గీత కార్మికుల వృత్తి రక్షణ కోసం ఉద్యమించాలి


కోటగిరిలో గీత పనివారాల సంఘం జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోటగిరి,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు తమ వృత్తి రక్షణకై మరింత ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం గీత పనివారాల సంఘం 67వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957లో గీత కార్మికుల హక్కుల సాధనకై తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ ధర్మభిక్షం గీత పనివారాల సంఘాన్ని స్థాపించారని పేర్కొన్నారు. గీత కార్మికుల హక్కుల కోసం సహకార సంఘాలు, టీఎఫ్‌టీ లైసెన్ వృత్తి రక్షణకై ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం వృత్తి కార్మికులకు రక్షణ పరికరాలు ఇస్తుందన్నారు. రాబోయే రోజుల్లో హక్కుల సాధనకై గీత కార్మికులు మరింత ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గీత పనివారాల సంఘం అధ్యక్షులు వెంకట్ గౌడ్, శ్రీధర్ గౌడ్, నరేష్‌గౌడ్, పండరిగౌడ్ పాల్గొన్నారు.

సిర్నాపల్లిలో ఘనంగా ఊరపండుగ


ఇందల్వాయి- సిర్నాపల్లిలో ఊరపండుగ నిర్వహిస్తున్న దృశ్యం

ఇందల్వాయి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊరపండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండాలని, చిన్నపిల్లలకు ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా ఉండేందుకు ఊరపండుగ నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని సారలమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారు జామున నుండే గ్రామదేవతలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామస్థులు బంధువులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అశోక్, నర్సయ్య, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం ఆదుకునేలా చూడాలి

బోధన్‌రూరల్,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను ఇప్పించేలా కృషి చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం పునర్ ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ముందుకు వెళ్లడం లేదన్నారు. ఫ్యాక్టరీ లేఆఫ్ అయిన నాటి నుండి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం సానుకూలంగా స్పందించారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, రవి శంకర్ గౌడ్, పోల్కస్వామి, శ్రీధర్, సరిచంద్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ కోదండరాంకు వినతుల వెల్లువ

నిజామాబాద్ అర్బన్: జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంకు వివిధ సంఘాలు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు వినతులను అందజేశారు. ఆదివారం ఎమ్మెల్సీ కోదండరాంను కలుసుకొని సమస్యలను వివరించారు. 2023 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు కలుసుకొని పాత పెన్షన్‌ను అమలయ్యే విధంగా చూడాలని పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యాశాఖలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ఖాళీగా ఉన్న జేఎల్, డైట్ లెక్చరర్ పోస్టులు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, ఎంఈవో పోస్టులు శాశ్వత ప్రాతిపదికన నింపాలని జీవో 317 ద్వారా వేరే జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకురావాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని కోరుతూ సంఘ అధ్యక్షుడు ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, మహేష్, గంగాకిషన్, యాదగిరిలు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఇతర శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని 370 జీవో ద్వారా అన్యాయం జరిగిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఉపాధ్యక్షుడు నర్సయ్య, వైద్య ఉద్యోగ సంఘ నాయకులు శ్రావణ్‌కుమార్, శంకర్, శ్రీధర్, బీసీ ఉద్యోగ కార్యవర్గ సభ్యులు, భూమన్న, సంజీవ్, జగన్‌లు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు. యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న ఆధ్వ ర్యంలో ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుకున్న సమయంలో ఒక్క పిరియడ్‌కు 700 మాత్రమే చెల్లిస్తున్నారని పార్ట్‌టైమ్ లెక్చరర్స్‌పై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించాలని ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. అరికెల హరిత, గంగాధర్, తదితరులు కలిసి విన్నవించారు.


ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులు

రైతు భరోసా ఎగవేతపై రైతుల ఆందోళన

● కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

మాక్లూర్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇవ్వాల్సిన ఖరీఫ్ రైతు భరోసా ఎగొట్టిన ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని మానిక్ భండార్ చెక్క వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారంటీలో ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలే దని వారు దుయ్యబట్టారు. రూ.15 రైతు భరోసా కల్పిస్తామని చెప్పిన రైతుల మోసం చేసిందని, కాంగ్రెస్ పాలనను ఎండగట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహించారు. అధిక సంఖ్యలో వాహనాలు నిలిచి ఇబ్బందులు కాగా పోలీసులు వాహన రాకపోకలను సరి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో పాటు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలల్లోనే ధాన్యం విక్రయించాలి

మాక్లూర్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్మిమోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్ అన్నారు. ఆదివారం మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో గల వల్లభపూర్ చిక్లి, గుంజిలి, కొత్తపల్లి, బోంకన్‌పల్లి, ముల్లంగి ధర్మోరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల డైరెక్టర్‌లతో పాటు కార్యదర్శి ప్రవీన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపికైన కొండాపూర్ విద్యార్థి

సిరికొండ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండల కొండ పూర్ హైస్కూల్‌కు చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు ఎంపికైనట్లు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మోజీరాం తెలిపారు. ధర్పల్లి జోనల్ స్థాయి క్రీడల పోటీలో మంచి ప్రతిభ చూపించిన శ్రీకాంత్‌ను జిల్లా జట్టుకు ఎం పిక అయ్యారని ఆయన తెలిపారు.రాష్ట్ర స్థాయిలో జరిగే స్కూల్ గేమ్ ఫెడరేష్ పోటీలలో శ్రీకాంత్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారిన మోజీరాం తెలిపారు.

మున్సిపల్ కార్మికురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు వసంత అనారోగ్యంతో మృతి చెందింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ మృతిరాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ రవిగౌడ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మాక్లూర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మాక్లూర్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి):మాక్లూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 విద్యసంవత్సరం పదవ తరగతి పూర్వవిద్యార్థులు ఆది వారం మాక్లూర్ స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరి నొకరు ఆత్మీయంగా పలకరించుకొని తాము ఏం చేస్తున్నామని ఆరాతీశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మా నిం చారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వవిద్యార్థులు ఆనందంగా జరుపుకున్నారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

వేల్పూర్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి) వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన చింతపల్లి రాజు అనే మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మోతె గ్రామానికి చెందిన చింతపల్లి రాజు మహిళ పడిగెల గ్రామంలోని తన బంధువు ఇంటికి వెళ్లేందుకు వేల్పూర్ రోడ్ వద్ద బస్సు కోసం వేచి చూడగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కోని వెళ్ళినట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు

● ఆలయాల్లో సామూహిక పూజలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జైబోలో గజానన్ మహారాజ్‌కి జై... ఓం గం గణపతియే నమహ... భక్తుల గణపతి నామాస్మరణలతో సంకష్టహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో సాగాయి. జిల్లా వ్యాప్తంగా గణపతి ఆలయాల్లో ఆదివారం సంకష్ట చతుర్థి పురస్కరించుకొని గణనాథునికి పంచామృత అభిషేకాలు, గరిక పూజలు, వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సార్వజనిక్ గణేష్ ఆలయం, ఎన్టీఆర్ చౌరస్తాలోగల శుభం కరోతి కల్యాణం, బోర్గాం(పి)లోగల లక్ష్మీగణపతి ఆలయం, పద్మనగర్‌లోని సిద్ధివినాయక ఆలయం, బొడ్డెమ్మ చెరువు వద్దగల మహాగణపతి ఆలయం, బ్రహ్మపురిలోని వరసిద్ధి వినాయక ఆలయం, న్యూ హౌజింగ్‌బోర్డులోని గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు రైతు భరోసా వెంటనే చేయాలి

మెండోర, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ తలారి గంగాధర్, కమ లాకర్, మచ్చర్ల రాజా రెడ్డి, నవీన్‌గౌడ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో శవం లభ్యం

నందిపేట, అక్టోబరు20: మండలంలోని వన్నెల్(కె) శివారులోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఆదివారం సాయంత్రం మేతరి అశోక్(40) అనే యువకుడి శవం లభ్యమైనట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మేతరి అశోక్ ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్ళి నందిపేట మండలం వన్నెల్(కె), డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామాల మధ్య ఉన్న ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ హరిబాబు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియవని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

తొర్లికొండలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఆదివారం 1985-86 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పూర్వవిద్యార్థులు కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 40మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



ప్రాజెక్టు గేట్ల నుంచి గోదావరిలోకి విడుదల అవుతున్న నీరు

ఎస్సారెస్పీ 12వరద గేట్ల ఎత్తివేత

మెండోర, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 46వేల942 క్యూసెక్కుల భారీగా వరద వచ్చి చేరడంతో ప్రాజెక్టు 12వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 37వేల 488 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం ప్రాజెక్టు వరద గేట్లను మూసివేశారు. ఆదివారం ఉదయం ప్రాజెక్టులోకి 14వేల క్యూసెక్కుల వరద చేరింది. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి వరద పెరగడంతో 12వరద గేట్లను ఎత్తి మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధానకాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 5800క్యూసెక్కులు, వరదకాలువకు 5వేల క్యూసెక్కులు, ఎస్కెప్ గేట్ల నుంచి 2200క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.5టీఎంసీ)లు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండల ఉందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఈ సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి 250.717టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందన్నారు. 177.617టీఎంసీల మిగులు జలాలను కాలువల ద్వారా వరద గేట్ల నుంచి గోదావరిలోకి విడుదల చేశామన్నారు.

రైతు వేదికలతో కర్షకులకు తప్పని తిప్పలు!

- మూడు గ్రామాల రైతులకు పెరిగిన దూరభారం
- అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్న రైతులు





దోమకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రైతుల సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు గతంలో మండల పరిధిలోని క్లస్టర్‌లలో రైతు వేదికలను నిర్మించి వ్యవసాయాధికారులతో పలు సలహాలు, సూచనలు పొందేందుకు రైతులకు అవకాశం కల్పించింది. దోమకొండ మండలంలో మొత్తం 10 గ్రామాలున్నాయి. ఇందులో దోమకొండ, అంబార్‌పేట రెండు క్లస్టర్‌లుగా ఏర్పాటు చేశారు. దోమకొండ క్లస్టర్‌లో ముత్యంపేట, చింతమాన్‌పల్లి, లింగుపల్లి, దోమకొండ, శేరీబీబీపేట, అంబార్‌పేట క్లస్టర్‌లో సంగమేశ్వర్, గొట్టిముక్కుల, అంచనూర్, సీతారాంపల్లి, అంబార్‌పేట గ్రామాలున్నాయి.



దోమకొండ రైతు వేదికలో రైతులకు వివరాలను తెలియజేస్తున్న ఏఈఓలు (ఫైల్)

ఆరు కిలో మీటర్లు ప్రయాణం చేయల్సిందే..

అంచనూర్, సంగమేశ్వర్, గొట్టిముక్కుల గ్రామాలు దోమకొండ చుట్టూ మూడు కిలో మీటర్ల దూరంలోనే ఉన్నాయి.ఈ మూడు గ్రామాల రైతులు అంబార్‌పేట రైతు వేదికకు వెళ్లాలంటే దోమకొండ నుంచి మరో ఆరు కిలో మీటర్లు ప్రయాణం చేయావలసిందే. అంటే మొత్తం 9 కిలో మీటర్లు వెళ్లవలసి ఉంటుంది. దీంతో రైతులు అంత దూరం వెళ్లాలంటే ఇష్టపడటం లేదు. ప్రభుత్వం తమ తమ క్లస్టర్‌లలోనే వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశాలు ఉండటంతో దోమకొండ రైతు వేదికలో ఏఈవో క్రిష్ణారెడ్డి, అంబార్‌పేట రైతు వేదికలో ఏఈవో మాన్యుష విధులు నిర్వహిస్తున్నారు. ఏఈవోతో ఏదైన ధ్రువ పత్రాలపై సంతకాలు అవసరమైతే అంబార్‌పేటకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. దోమకొండకు కొంత దూరంలో ఈ గ్రామాలు ఉండటంతో ప్రతి రోజు దోమకొండకే వివిధ పనులపై రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఏఈవోలతో సంతకాలు అవసరమైతే అంబార్‌పేటకు వెళ్లవలసి వస్తోందని అక్కడికి వెళ్లడానికి బస్సు సౌకార్యం కూడా లేదని రైతులు వాపోతున్నారు. అంబార్‌పేట క్లస్టర్ ఏఈవోనే అక్కడ విధులు ముగించుకుని సాయంత్రం సమయంలో దోమకొండ రైతు వేదికకు చేరుకుని ఇక్కడ గ్రామాల రైతులకు సేవలందింస్తున్నారు. అందరు రైతులు ఒకే దగ్గర కలసి ఏవైన సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. రైతు వేదికలను ప్రణాళిక ప్రకారం నిర్మించి ఉంటే అన్ని గ్రామాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని రైతులు తెలుపుతున్నారు. ముఖ్యంగా శేరీబీబీపేట నుంచి దోమకొండకు రైతులు రావాలంటే 11 కిలో మీటర్లు రావాలి. అక్కడి రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో కొనసాగుతున్న పెద్దలు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ డబ్బుల పరిశీలనకు రైతుల ఇబ్బందులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ. 2 లక్షల వరకు ఉన్నటువంటి రుణమాఫీని కటాఫ్ తేదీతో రెండు విడతలుగా మాఫీ ప్రకటించింది. అయితే మొదటి విడతలో రూ. లక్షా, రెండవ విడతలో రూ. లక్షా50 వేలను మాఫీ చేసింది. మండలంలోని రైతులు తమ రుణమాఫీ ఖాతా వివరాల పరిశీలనకు ఏఈవోలను సంప్రదించలంటే కొన్ని గ్రామాల రైతులు అంబార్‌పేట వెళ్లలేక దోమకొండ రైతు వేదిక వద్దనే వేచి చూస్తున్నారు. అంబార్‌పేట ఏఈవో సాయంత్రం వరకు అంబార్‌పేట రైతు వేదికలో విధులు నిర్వహించి రైతులకు వివరాలను తెలియజేసి అనంతరం దోమకొండ రైతు వేదిక చేరుకుంటుంది.

దోమకొండ వేదికలో సేవలు

దోమకొండ రైతు వేదికలో గొట్టిముక్కుల, సంగమేశ్వర్, అంచనూరు గ్రామాలకు చెందిన రైతులకు ఏఈవో రుణమాఫీ ఖాతా వివరాలను తెలియజేస్తుంది. ప్రతి రోజూ దోమకొండ రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉంటు సేవలందిస్తున్నారు.

క్లస్టర్‌లో గ్రామాలను మార్చితే రైతులకు మేలు

అంబార్‌పేట క్లస్టర్ నుంచి గొట్టిముక్కుల, సంగమేశ్వర్, అంచనూర్ గ్రామాలను దోమకొండకు మార్చితే రైతులతో పాటు ఏఈవోకు సైతం మేలు జరుగుతుంది. రైతులకు దూరంభారం తగ్గుతుంది. సమయం ఆదా అవుతుందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. తమ సమస్యను జిల్లా అధికారులు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

మరో క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు

దోమకొండ మండలంలో 10 గ్రామాలకు సంబంధించి రెండు రైతు వేదికలు, రెండు క్లస్టర్‌లుగా ఉన్నాయి. అయితే దోమకొండ మండలంలో ఏవోతో పాటు ఇద్దరు ఏఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. దోమకొండకు మరో క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవో పోస్టును మంజూరు చేస్తే రైతులతో పాటు అధికారులకు మేలు జరుగుతుందని మండల రైతుల అభిప్రాయపడుతున్నారు.



బోధన్ మండలంలో ప్రధాన రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం

రోడ్లపై ధాన్యం రాశులతో.. జర జాగ్రత్త!

- రోడ్లపై కిలోమీటర్ల మేర ధాన్యం రాశులు
- మొదలైన రోడ్డు ప్రమాదాలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


బోధన్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు ఊపందుకోవడంతో రోడ్డు ప్రమాద ఘంటికలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు కోసిన ధాన్యాన్ని రోడ్ల పైన ఆరబోస్తుండడం, రోడ్లకు ఇరువైపులా ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడం ప్రమాదాలను హెచ్చరిస్తున్నాయి. రోడ్లపై ధాన్యం రాశులతో వాహనదారులు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పగటి వేళ, రాత్రి వేళ వాహనాలపై వేగంగా వెళ్లే వారు ఇక జాగ్రత్తగా ప్రయాణాలను సాగించాల్సి ఉంది. ఇప్పటికే రోడ్లపై ధాన్యం ఆరబోతలతో రోడ్డు ప్రమాదాలు మొదలయ్యాయి. ప్రతియేటా వానాకాలం, ఎండాకాలం ధాన్యం కోతలు మొదలై ధాన్యం అమ్మకాలు ముగిసే వరకు రోడ్డు ప్రమాదాలు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకుంటుండడం పలుచోట్ల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఇక రోడ్డు ప్రమాదాలలో కాళ్లు చేతులు విరిగి ఆరచేతిలో ప్రాణాలతో బయట పడ్డవారి సంఖ్య చెప్పనక్కర్లేదు. మళ్లీ ధాన్యం కోతల సీజన్ మొదలు కావడంతో రోడ్ల పైకి ధాన్యం రాశులు వచ్చిపడుతున్నాయి. రైతులు ప్రత్యామ్నాయం లేక ధాన్యం ఆరబోతను రోడ్ల పైనే చేపడుతుండడంతో వాహనదారులు జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి ఉంది. రాత్రి వేళా అయితే మరి జాగ్రత్తగా ప్రయాణాలు చేయాల్సి ఉంది. రైతులు ధాన్యం ఆరబోసి సాయంత్రం వేళా వాటిని కుప్పలుగా మార్చి ఆ కుప్పలకు అడ్డుగా రాళ్లను ఉంచుతుండడం ఈ రాళ్లతో ద్విచక్ర వాహనదారులకు, ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతుండడం పరిపాటిగా మారింది. ధాన్యం కుప్పల పక్కనే రైతులు పెట్టే రాళ్లు వాహనదారుల పాలిట యమకింకరులుగా మారుతున్నారు. ఇట్టే ప్రాణాలను బలిగొంటున్నాయి. రోడ్ల పైన ధాన్యం రాశుల ఆరబోత ధాన్యం కుప్పల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పరిస్థితులున్నాయి. లేనట్లు అయితే క్షణాలలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

కిలోమీటర్ల పొడవునా రోడ్ల పై ధాన్యం కుప్పలు

వరికోతలు ముమ్మరం కావడం యంత్రాలతో వరికోతలు వేగంగా కొనసాగుతుండడంతో రైతులు ధాన్యం రాశులను రోడ్ల పైకి చేర్చి ఆరబెడుతున్నారు. బోధన్ డివిజన్, జిల్లా పరిధిలో ప్రధాన రహదారులు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల రోడ్ల వరకు ఎటుచూసినా కిలోమీటర్ల మేర ఆరబోసిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. బాన్సువాడ నుంచి నిజామాబాద్ వెళ్లే రహదారి పొడవునా వర్ని, చందూరు, మోస్రా, నాగారం వరకు ధాన్యం రాశులు రోడ్ల పైనే కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్లే రహదారి పొడవునా ధాన్యం రాశులే ఉన్నాయి. బోధన్ నుంచి రెంజల్, బోధన్ నుంచి రుద్రూరు, కోటగిరి, బీర్కూర్ వెళ్లే దారులు, బోధన్ నుంచి సాలూర వెళ్లే దారుల పొడవునా ధాన్యం కుప్పలు పేరుకపోయాయి. గత పది రోజులుగా వరికోతలు ఊపందుకోవడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతుండడంతో ధాన్యం రాశులు రహదారుల పొడవునా దర్శనమిస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అవుతే రోడ్ల పైన ధాన్యం రాశులు తగ్గే అవకాశం ఉంది. అక్టోబరు, నవంబర్ మాసాలు రోడ్ల పై ధాన్యం రాశులు తప్పనిసరి ఉండే అవకాశం ఉంది. కిలోమీటర్ల పొడవునా ఉండే ఆరబోసిన ధాన్యం, ధాన్యం రాశుల పట్ల వాహనదారులే జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అతివేగం వల్ల, అజాగ్రత్త వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.



ప్రమాదాలు జరిగితే కేసులు తప్పవు..



● శ్రీనివాస్, ఏసీపీ బోధన్

రోడ్లపై ధాన్యం ఆరబోసినప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత వ్యక్తుల పై కేసులు తప్పవని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. రోడ్ల పై ధాన్యం రాశుల ఆరబోత, కుప్పలు ఏర్పాటుపై ఏసీపీ శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రోడ్ల పైన ధాన్యం ఆరబోయడం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. రైతులు ధాన్యం ఆరబోసినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయడం ఇతర ముందు జాగ్రత్తల చర్యలను తీసుకోవాలన్నారు. రాత్రివేళ వాహనాలు అదుపుతప్పి బోల్తాపడడం ప్రాణాలు కోల్పోయిన ఘటనలు గతంలో అనేకం జరిగాయన్నారు. రైతులు రోడ్ల పైన ధాన్యం ఆరబోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ధాన్యం కుప్పల వద్ద రాత్రివేళ పడుకునే సందర్భంలో ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల పోలీసు సిబ్బందిని పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తామని రైతులకు అవగాహన కల్పిస్తామని ఏసీపీ పేర్కొన్నారు.





ఇసుక విధివిధానాలపై గ్రామ కమిటీల పెత్తనం ఎంటీ?

- అధికారుల అండ ఉందంటున్న గ్రామ కమిటీలు
- మండలంలో ఎక్కడికక్కడ ఇసుక డంపులు
- అధికారుల సెలవు దినాల్లో గుట్టు చప్పుడు కాకుండా ఇసుక తరలింపు

మెండోర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వంలో పేదోడు ఇళ్లు కట్టుకోవాలంటే ట్రాక్టర్‌కు రూ.900 డీడీ తీసి ట్రాక్టర్ కిరాయి కొంత ఇసుక ఆ గ్రామం మీద నుంచి వెళ్లాలంటే ఇంకొంత చెల్లించి మొత్తం మీద రూ.6నుంచి రూ.7వేలకు ఒక ట్రాక్టర్ ఇసుక కొనుగోలు చేసేవారు. నేడు ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు కట్టుకునే పేదప్రజలను ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఇసుక విధివిధానాలపై గ్రామ అభివృద్ధి కమిటీ పెత్తనం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అని పక్క అంటుంటే నియోజకవర్గంలో వాగులో నుంచి ఇసుక వెళ్లాలంటే గ్రామ కమిటీలకు ముడుపులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

రెండు, మూడు రోజుల్లో మొదలు కానున్న ఇసుక పాయింట్లు..

నియోజకవర్గంలో రెండు, మూడు రోజుల్లో ఇసుక పాయింట్లు మెదలు కాన ఎన్నాయని దీనికి గ్రామ కమిటీ వారు అధి కారులు అండతోనే ఇసుక పాయింట్లు జరు గుతాయని మార్కెట్లో బాహాటంగానే చర్చించుకుంటున్నారు. వాగులో నుంచి ట్రాక్టర్ పైకి ఎక్కాలంటే రెండు లేదా మూడు వేలు చెల్లిస్తే ట్రాక్టర్ పైకి ఎక్కిస్తాడు. లేదంటే ట్రాక్టర్ ఇసుక కాలి చేయాల్సిందే. అంటే ట్రాక్టర్ కిరాయి రెండు వేలు గ్రామకమిటీ అక్రమ వసూలు మూడు వేలు ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే రూ.5వేలు చెల్లించాల్సి వస్తుందని ఇళ్లు కట్టుకునే పేదప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అండతో ఇసుక అక్రమ రవాణా..

అధికారులు ఇసుక మాఫియాల మధ్య సయోధ్య కుదిరిందా అంటే అవును కుదిరింది అనచ్చు. ఎందుకంటే కొత్త మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో జూనియన్ అసిస్టెంట్ కనుసన్నల్లో ఇసుక పాయింట్ల వద్ద ఎన్ని ట్రిప్పులు ఇసుక బయటకు వెళ్ళింది. ఎన్ని ట్రిప్పులు నగదు ముట్టచెప్పలో తతంగం ఐదు నెలల కింద నడిచింది. ఇంత నడిచిన కానీ జిల్లా అధికార యంత్రాంగం ఒక్కసారైనా అధికారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు కూడా మాకు సెలవు రోజు వస్తే చాలు మీ పని మీరు కానిచ్చుకోండి అన్న చందంగా మారింది. సెలవు దినం వస్తే చాలు రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా పక్క జిల్లాకు వెళ్తుంది.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు..

: సంతోష్‌రెడ్డి, తహసీల్దార్, మెండోర

ఉచిత ఇసుకపై ఇంకా ఆదేశాలు జారీ కాలేదని ఆదేశాలు జారీ చేస్తే విధివిధానాలు ప్రకటిస్తామని మైనింగ్ అధికారులు వచ్చి ఇసుక పాయింట్లు చూశారని వారి ఆదేశాలు వచ్చే వరకు అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగునీరు

- ఆరు నెలలుగా డ్రైనేజీని శుభ్రం చేయని అధికారులు
- ప్రత్యేక పాలనలో తప్పని అవస్థలు



గంగాసరం గ్రామంలో డ్రైనేజీలో నిలిచిపోయిన చెత్తాచెదరం

డొంకేశ్వర్ , అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాసరం బీసీ వాడలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగుకాలువల్లో చెత్తాచెదరం పెరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డంతా దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఆరు నెలల నుంచి డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పాటు దోమలు ఉత్పత్తితో పాటు రాత్రి వేళల్లో విష సర్పాలు తిరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతుతున్నారు.



రైతు భరోసాపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు



ఎల్లారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



దోమకొండలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసాపై, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కామారెడ్డిటౌన్: పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఎగుల నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకల సాయిలు, బీఆర్ఎస్ నాయ కులు శ్రవణ్, నాగం సురేందర్, రాజయ్య, మల్లారెడ్డి, రాము, ఇమ్రాన్, భర్కత్, అట్కురి బబ్లూ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతు భరోసాపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

నాగిరెడ్డిపేటలో బీఆర్ఎస్ నేతల రాస్తారోకో

నాగిరెడ్డిపేట: రైతు భరోసాను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్దయ్య, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు మోతే శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కృష్ణ, మండల నాయకులు యాదగిరి, సంతోష్ గౌడ్, నారాయణ, హన్మంత్‌రెడ్డి, రాజిరెడి పాల్గొన్నారు.

రైతు భరోసాను విడుదల చేయాలి

దోమకొండ: రైతులకు వర్షకాలపు పంటకు సంబంధించి రైతు భరోసా డబ్బులను రైతులకు అందజేయాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఆదివారం దోమకొండలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంద్ర మదుసుధన్‌రావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంచాల శేఖర్, నాగరాజు,రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, మండల మహిళ నాయకురాలు సునీత, గంగధర్, సాయిరెడ్డి, కిషన్‌రెడ్డి, చంద్రం, సిద్ధరాములు, అంజయ్య, ఎస్‌పాల్, నవీన్, శేఖర్, బుర్రి రవి, సత్యం, జైపాల్, రవి, మురళి, నాగరాజ్‌రెడ్డి, సలీం పాల్గొన్నారు.

రైతులకు పంట పెట్టుబడి హామీ నెరవేర్చాలి

బిచ్కుంద : సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పంటపెట్టుబడికి అమలు చేస్తానన్న రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావుదేశాయ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రభుత్వం పంట పెట్టుబడి సహాయాన్ని తక్షణమే రైతుల బ్యాంకుఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు.

రైతుబంధు నిధులు విడుదల చేయాలి

గాంధారి: కాంగ్రెస్ ప్రభుత్వంవెంటనే రైతుబంధు నిధులను విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు గాంధారి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.15 వేల రైతుభరోసా అందిస్తామని చెప్పి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివాజీ రావు, రెడ్డిరాజు, మల్లేష్ యాదవ్, సాయిలు, సురేష్, సంతోష్, ముస్తఫా, గంగాధర్, ప్రేమ్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

రాజంపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం రైతులకు రైతుబంధు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చ్చిన హామీ ప్రకారం రైతులకు న్యాయం చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలవంతరావు, నాయకులు నల్లవెల్లి అశోక్, మోహన్ రెడ్డి, రమేష్, కమలాకర్, బాలయ్య, శ్రీకాంత్, స్వామి, రాజు,భాస్కర్, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి రాజాగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంజినాయక్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్,గంగారెడ్డి, గోవింద్‌రెడ్డి, చంద్రం, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

లింగంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని వెంటనే రైతు బందు రైతుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలు ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిలు, నర్సింలు, మాకల రాములు, బాలకిషన్, లక్ష్మన్ ఉన్నారు.

రైతులకు తక్షణమే రైతుబంధు అందించాలి

సదాశివనగర్: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీతో పాటు రైతుబంధు అందించాలని మాజీ జడ్పీటీసీ పడగల రాజేశ్వర్‌రావు అన్నారు. సదాశివనగర్‌లో సీఎం దిష్టిబోమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటి చైర్మన్ కమలాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మర్కంటి బుచ్చయ్య, గడిల భాస్కర్ పాల్గొన్నారు.

రోజుకో మాట మాట్లాడుతున్న ప్రభుత్వం

తాడ్వాయి : రైతుభరోసాపై రోజుకో మాట మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తుందని మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.



ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

అపూర్వం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగిరెడ్డిపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో పదో తరగతి చదివి 36 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తరువాత తాము తిరిగి ఒక చోట కలవడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో చదివిన అప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తాము చదివిన పాఠశాలకు తమవంతుగా ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మనోహర్‌రెడ్డి, భీంరెడ్డి, రామాగౌడ్, ఎల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 క్రికెట్ పోటీలు ప్రారంభం



అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

దోమకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమకొండలో అండర్ 17 బాల, బాలికలకు క్రికెట్ సెలక్షన్ పోటీలను స్కూల్ ఫెడరేషన్, దోమకొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించినట్లు కోట సీనియర్ మేనేజర్ బాబ్జి తెలిపారు. పోటీలను ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా దోమకొండ ఆనంద్ భవన్‌లో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి సెలక్షన్స్ నిర్వహించామన్నారు. బాల, బాలికలకు సంబంధించి టీంలను జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి పంపించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని వివిధ మండలాల నుంచి క్రీడాకారులు, పీఈటీలు, కోట సూపర్ వైజర్ నేతుల గణేష్ యాదవ్ పాల్గొన్నారు.

78 యూనిట్ల రక్త సేకరణ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం, ఐవీఎఫ్, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 78 యూనిట్ల రక్తసేకరణ చేపట్టినట్లు రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న చిన్నారులు పదివేలకు పైగా ఉన్నారని అలాంటి చిన్నారులకు 20 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉందన్నారు. ఇటీవల రక్తనిధి కేంద్రాల్లో రక్తనిల్వలు లేకపోవడంతో చిన్నారులకు కావాల్సిన రక్తం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తలసేమియా సికిల్‌సెల్ సొసైటీ సూచనల మేరకు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేదప్రకాష్, ప్రధానకార్యదర్శి గంపప్రసాద్, ఉపాధ్యాక్షుడు జమీల్‌హైమద్, డాక్టర్ పుట్ట అనిల్‌కుమార్, కిరణ్, ఎర్రం చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, గురువేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది

కామారెడ్డిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు అందించిన సహకారం మరువలేనిదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నాగెలుపును భుజనా వేసుకుని గెలిపించారని వారందరికి రుణపడి ఉంటానని తెలిపారు. సమస్యల సాధనలో ముందు ఉంటానని అన్నారు. 8 సంవత్సరాలుగా జిల్లా అధ్యక్షునిగా కామారెడ్డిలో పనిచేసే అవకాశం కల్పించినందుకు ఉపాధ్యాయులందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రాబోయే టీచర్ ఎమ్మెల్సీ కరీంనగర్ నియోజకవర్గ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నాడని అతనికి ప్రతి ఉపాధ్యాయుడు సహకరించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుషాల్, జిల్లా ప్రధానకార్యదర్శి పుట్టశ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆయామండలాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి

టీఎన్జీవోస్ కార్యాలయ నిర్మాణ భూమిపూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎల్లారెడ్డి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో నూతనంగా నిర్మించే టీఎన్జీవోస్ కార్యాలయ నిర్మాణ భూమిపూజకు ప్రత్యేక ఆహ్వానాన్ని ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు నివాసంలో కలిసి ప్రత్యేక ఆహ్వానాన్ని అందజేశారు. అదేవిధంగా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు లచ్చిగారి మహిపాల్, కార్యదర్శి చరణ్‌కుమార్, సభ్యులు రవీందర్, రాజాగౌడ్, శ్రీకాంత్, అరుణ్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.